# గణపతి – చలపతి

ఆ వూళ్ళో విఘ్నేశ్వరాలయం ఎక్కడుందో తెలీనివాళ్ళుండొచ్చుగాని, వెంకాయమ్మగారి ప్రధమ సంతానం గణపతిని ఎరగని వాళ్ళుండరనడంలో అతిశయోక్తి అణుమాత్రం వుండటానికి వీల్లేదు. అతడు ఆ వూళ్ళో కదు ప్రసిద్దుడుకాఫీ హోటల్సులోనూ, సినిమాహాళ్ళ వద్ద, మంగలి షాపుల్లో అతడిని ఇట్టే గుర్తిస్తారు. కాఫీ హోటలుకెళ్లి తనివితీరా సుష్టుగా తిని, నిజాయితీగా కౌంటరు వద్ద కెళ్ళి 'డబ్బుల్లేవు. పిండిరుబ్బమంటారా? ప్లేట్లు కడగమంటారా? అని అడిగేది అలడొక్కడే. అంచేతనే అతడిని చూడంగానే, యాజమాన్యంవారు టిఫిన్ సెక్షన్ క్లోజుయిందని అబద్ధం ఆడటమో. అడ్వాన్స్ కావాలని కాళ్ళా వ్రేళ్ళాపడటమో తరచు జరిగే తంతు. అలాగే సినిమా రిలీజయిన మొదటి రోజు గేటు దగ్గర నిల్చుని లోపలికొస్తున్న జనంతో సినిమా పరమచండాలంగా వుందని, ఫలానా సినిమాని కాపీ కొట్టారని, సంగీతం వెగటు పుట్టిసోందని, ఈ సినిమా చూడటం కన్నా ఇంటికెళ్లి టీవీ కార్యక్రమాలు భరించటం నయమని మీటింగులు నిర్వహిస్తుంటే హాలు వారు ఆదరాబాదరాగా తరలివచ్చి మన గణపతిని సాదరంగా లోనికి ఆహ్వానించి ఫ్రీగా సినిమా చూపించి. రిక్ష డబ్బులిచ్చి మరీ ఇంటికి పంపిస్తారు. ఆ వూళ్ళో పల్లెత్తు మాట అనకుండా నిశ్శబ్దంగా అతడిని భరించేది మంగళిషాపువాళ్ళే! హెయిర్ కటింగ్ సెలూన్ కనిపిస్తే గణపతికి అందాలు అలంకారాలు చప్పున గుర్తుకొస్తాయి. వెంటనే సెలూన్‌లోకి వెళ్ళి మొహం పైన నీళ్ళని చిమ్ముకుని, తుడిచి పౌడరు అద్ది, క్రాఫింగ్ దువ్వి, బాగాలేదని ఇంకోసారి గట్టిగా దువ్వి, అనేక భంగిమల్లో అద్దంలో చూసుకుని ఇంట్లోంచి వీధిలోకి వస్తున్నట్టు విజిల్ వేసుకుంటూ వెళ్లిపోతాడు. ఆ షాపులవాళ్ళు అతడి చొరవకి ఏ మాత్రం బాధపడక, కాలికి చేతులకి గోళ్లు తీయమని, మీసాలు కత్తిరించమని, చెవిలో నూనె వెయ్యమని వొళ్లు పట్టమని అడగనందుకు మురిసిపోతారు.

గణపతి కడుపున పడంగానే రాయిలా తిరిగే తండ్రి రాత్రికి రాత్రి అనంత విశ్వంలో లీనమయిపోయాడు. అంచేత తల్లి వెంకాయమ్మ అతడిని గారాబంగా పెంచింది. అతడి జాతకం చూసిన వూరి సిద్ధాంతి, వీడు చాలా ప్రసిద్ధమైన వ్యక్తి అవుతాడని చెప్పినపుడు మరోలా వూహించి పొంగిపోయింది.

కాని తనయుడు ఏడోక్లాసు ఏడుసార్లు తప్పి ప్రపంచ రికార్డు స్థాపించినపుడు ఎంచేతనో కాస్త దిగులు పడింది. తనకి చావయినా రాకుండా పోయినందుకు తెగ కుళ్ళిపోయింది. కాని గణపతి ఇవన్నీ పట్టించుకునే చవకబారు కుర్రాడు కానే కాదు. ఇటువంటి సంకుచిత భావాలకి, చాదస్తపు కన్నీళ్లకి, అర్థం లేని భయాలకి అతడు కడు దూరం. అతడు గట్టి ఆశావాది. శరీరంలాగే మనసుకూడా మహాగట్టి. ఇరవై ఏళ్ళకే సోడావుప్పు తగిలిన పిండివంటలాగా బుస్సున పొంగడు. అంచేత ప్యాంట్లు, చొక్కాలు అతనిని భరించలే కడుపులు చించుకున్నాయి. ఈ విపత్కర పరిస్థితికి అతడే మాత్రం క్రుంగిపోకుండా, వెలిసిపోయిన చీరల్ని లుంగీ పద్ధతిలో ధరించి ఆ వూళ్ళో కొత్త ఫ్యాషన్లకి అంకురార్చణ చేసాడు. తన జీవితంలో ఎవరికీ తెలీని నిగూఢ రహస్యం ఒకటుందని, అది ఎప్పుడో, చెప్పాపెట్టకుండా ఫెడీల్మని బద్దలయిపోతుందని దాంతో తన జీవితగతే మారిపోతుందని, గట్టిగా నమ్మి, ఆ క్షణం కోసం పగలు రాత్రిళ్ళూ ఎదురుచూస్తూ కాలాన్ని భారంగా నెట్టుకొస్తుండగా...

ఒక రోజు

అన్ని గడియారాల్లోనూ ఉదయం పది గంటలయింది. వీధులు జనంతో, వాహనాలతో, ఆవులు గేదెలతో రద్దీగా వున్నాయి. మానవులు జంతువుల్ని, మనుషుల్ని జంతువులు తిట్టుకుంటూ, తప్పుకొంటూ, తోసుకుంటూ వాళ్ళ వాళ్ళ పన్లమీద వెడుతున్నారు. సూర్యుడు మతిస్థిమితం తప్పిన పతిదేవుడులాగా మబ్బులతో ఆడుకుంటున్నాడు.

ఆ సమయానికి గణపతి దేవాలయానికని బయల్దేరి, త్రోవలో కంటపడ్డ నేషనల్ హెయిర్ కట్టింగ్ సెలూన్లోకి అలవాటు ప్రకారం జొరపడి పౌడరు పూసుకుని, తలదువ్వుకుంటూ, అద్దంలోంచి వీధివంక చూస్తుండగా, మొదటిసారిగా రంగి అతడి కంటపడింది.

రంగి రబ్బరుబంతిలాగా వుంటుంది. గుండ్రని మొహం, పొంగిన వొళ్లు మత్తుచూపులు, మందహాసం, ఒకేసారి చూసి తలతిప్పుకోలేకపోయే అందం కాదు. మళ్ళీ మళ్లీ చూడాలనిపించే రూపం. ఆ ఉదయం వీధిలో వెడుతున్న ఆమెకు రిక్షా అడ్డురావడంతో సరిగ్గా నేషనల్ హెయిర్ కట్టింగ్ సెలూన్ ముందు ఒక్కక్షణం ఆగింది. ఆ ఒక్కక్షనంలోనే గణపతి కంట అద్దం ద్వారా పడింది అంతే ఆమె సరాసరి గణపతి గుండెల్లోకి పిడిబాకులాగా దూసుకుపోయింది. చేతిలోని దువ్వెన క్రిద పడిపోయింది.

తన నూతన జీవితానికి ద్వారాలు తెరవాల్సిన దేవత తాళం చెవితో సహా వెళ్ళిపోతున్నట్లుగా కంగారుపడి, పక్కన గడ్డం గీయించుకుంటున్నవాడ్ని డొక్కలో తన్నుకుంటూ వీధిలోకి ఒక్క అంగలో దూకాడు. అటూ ఇటూ చూశాడు. రంగి దూరంగా కనిపించింది. గణపతి నడకని, పరుగుని కలిపి కొత్త ప్రక్రియలో ప్రయాణం ప్రారంభించాడు. అతడి దృష్టి లోపల రంగిమీద తప్ప మరిదేనిపైన లగ్నం కావడం లేదు. తన మార్గానికి అడ్డం వచ్చిన ముసలాయన్ని మురుగుకాలవలోకి నెట్టాడు. స్కూలు కుర్రాడి టిఫిన్ డబ్బాని నేలకరిపించాడు. స్కూటరు పైనించి దూకాడు. సైకిల్ని లారీకిందకి పంపించాడు. కానీ ఇవేమీ అతడికి తెలీవు... అతడి దృష్టిలో కనిపిస్తున్న రంగి మాత్రం సత్యం, మిగిలినవన్నీ అసత్యం.

రంగి చకచకా నడుచుకుంటూ సందులు, గొందులు, మురుక్కాలువలు, గుడిసెలు దాటి వెళ్ళి వెళ్ళి చివరికి ఒక చిన్న పెంకుటింట్లోకి వెళ్ళింది. గణపతి ఆగాడు. ఆ ఇంటిని వాతావరణాన్ని పరీక్షగా చూశాడు. నిద్రాణమైనపడుతున్న తన మనస్సుని కొట్టి లేపిన దేవత గుడి ఇదేనన్న మాట అనుకున్నాడు. జేబులోంచి చేతిగుడ్డ తీసి మొహం తుడుచుకున్నాడు. సొంత దువ్వెన తీసి తలదువ్వుకున్నాడు. మర్చి పోటానికి వీల్లేకుండా ఆ ఇంటిని ఇంకోసారి చూసి, వెనక్కి తిరిగాడు. అక్కడ నిలబడి చూస్తున్న చలపతి అతడి దృష్టినాకర్షించాడు.

చలపతి నిల్చుంటే మూడడుగులు, కూర్చుంటే అడుగున్నర ఎత్తుంటాడు. ఇరవై అయిదేళ్ళు. బియ్యే ఫస్టుక్లాసున పాసయ్యేడు. గడ్డాలు, మీసాలు కూడా రాక మొహం పదేళ్ల కుర్రాడికిమల్లే తేటగా, లేతగా కనిపిస్తుంది. పుట్టిన పదేళ్ళదాకా ఎదిగిన శరీరం ఎంచేతనో అక్కడితో ఆగిపోయింది. ఏళ్లు గడుస్తున్నా శరీరం వూహించారు. అతడిని చూపి గణపతి గూడా అలాగే భ్రమడిపోయింది. అతడ్ని చూడంగానే ఆరోక్లాసు చదివే పదేళ్ళ బాలుడనే అనుకుంటారు. గానీ ఇరవై అయిదేళ్ళ పట్టభద్రుడని వూహించనుగూడా అలాగే అనుకుని ముచ్చటపడి, రంగి గురించి విషయ సేకరణ కోసం లయగా ప్రయత్నించాడు. 'ఏం బాబూ... నీ పేరేటమ్మా...ఏం చదువుతున్నావ్' అంటూ పదేళ్ళ శరీరంలో ఇరుక్కుపోయిన పాతికేళ్ళ చలపతికి అతడి పలకరింపుతో వొళ్ళు మండిపోయి, 'నోర్మూసుకోవోయ్... వెధవ్వేళాకోళాలు... చిన్నా పెద్దా లేకుండా... బుద్ధిలేదూ' అంటూ కోపగించుకోగా, గణపతి పిల్లవాడి చురుకుదనానికి, ధైర్యానికి మరింత ముగ్ధుడయ్యి, లాలనగా, పక్కనే కూర్చుంటూ, 'నీకు చాక్లెట్స్ కొనిస్తాగాని? ఆ పెంకుటిల్లు ఎవరిది? ఇలా వెళ్ళిందే, ఆమె నీకు తెలుసా? పేరేమిటి? పెళ్ళయిందా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

తను ప్రేమించిన దాన్ని గురించి తన ముందే సాక్షాత్తూ తననే ముక్కూ మొహం తెలీని గుమ్మడికాయి వెధవ ప్రశ్నలు కురిపిస్తుంటే, శరీరస్థితి ఎలా ఉన్నా, వొళ్లు మండిపోవటం సర్వసహజం. అంచేత చలపతికి గణపతిపైన చెప్పలేనంత కోపం వచ్చింది. సముద్రం అంత ఆవేశాలున్నా, గరిటలాంటి శరీరం వున్నప్పుడు సహనం అవసరం అనే తాత్విక చింతన తెల్సినవాడు కావటం చేత చలపతి ఋషిలాగా నవ్వేడు.

కాని గణపతికి చలపతిలోని మానసిక సంఘర్షణ తెలీకపోవటం చేత అతడిని మరింత ప్రలోభపెట్టే ధోరణిలో 'నే అడిగిన వాటికి సమాధానం చెప్పావంటే – మరి నీకు బోల్డన్ని బొమ్మలు, లక్క పిడతలు కొనిస్తా.. ఇంకా ఫ్రీగా చక్కగా క్రాపు చేయిస్తా. చెప్పమా... ఆ పిల్ల పేరేమిటి? పెళ్లయిందా?' అన్నారు.

చలపతికి ఈ రంపపుకోత భరించడం శక్తికి మించిన పనయిపోయింది. మౌనంగా వెళ్లిపోదామంటే మనసు మొరాయిస్తోంది. పాములాంటి శత్రువుని

పట్టునట్లు వదిలి వెళ్లిపోవడం కన్నా వొడుపుగాపట్టి బంధించడం తెలివైన పని కాబట్టి చలపతి నోరువిప్పేరు. ఆమె పేరు రంగనాయికి. అంతా రంగి అంటారు. ఇంకా పెళ్లికాలేదు.

పెళ్లికాలేదన్న మాటతో గణపతిలో ఆనందం కట్టలు తెంచుకుంది. ఆనందం అనేక రకాలుగా బహిర్గతం అవుతుంది. గణపతి చలపతిని రెండు చేతులతో గాల్లోకి లేపి గిరగిరా తిప్పుతూ ఓహోహో... ఆహహ్హ...లలాలలా... అంటూ పొంగిపోతుండగా చలపతి తెలివిగా అతని చేతుల్లోంచి తప్పించుకుని కిందికిదూకి మేరు పర్వతం ముందు మేకపిల్లలాగా నిల్చుని ఆ పిల్లని నువు ప్రేమించేవా అనడిగారు.

గణపతికి పిసరంత సాహిత్య ప్రవేశం కూడా ఉంది. గ్రంథాలయం, మంగలిషాపుల్లో పుస్తకాలు ఎన్నో చదివేడు. ఆ అనుభవంతో చలపతి ప్రశ్నకి సాహిత్య బాణీలో బదులిచ్చాడు. ప్రేమించాను. పది నిమిషాల క్రితం ఆమెని తొలిసారి చూసేను. చూడంగానే నా మనసు అధీనం తప్పింది. ఈ గాలీ, ఈ నీరు, భూమి, ఆకాశాల సాక్షిగా ప్రేమించాను. ప్రేమిస్తున్నాను

. ప్రేమిస్తాను...మా పవిత్రమైన – ప్చ్... చలపతి అతడి ఆవేశానికి ఆనకట్టలేస్తూ, ఆమెకి నీవు తెల్సాని?

తెలీదు

పలకరించేవా?

లేదు

నీ మొహం ప్రేమా నువ్వూను, మొగ వెధవ ముప్పయి ఆరుమందిని చూస్తాడు. చూడంగానే ప్రేమించి పారేస్తాడు. అదికాదు ముఖ్యం. ప్రేమించబడాలి. ఆవైపు నుంచి వచ్చిందే ప్రేమ. ఇటు నుంచి వెళ్లేది ప్రేమకాదు, పిచ్చి–

గణపతిలోని ఆవేశం చల్లారిపోయింది. నేలపైన చతికిలపడ్డాడు. చలపతిని వొళ్లో కూర్చోపెట్టుకుంటూ చూట్టానికి చిన్నాడివే గానీ బాగా అనుభవజ్ఞుడివిలాగా ఉన్నావు. ఆమెచేత ప్రేమించబడాలంటే ఏం చెయ్యాలో చెప్పు. నీకు హోంవర్కు ఆర్నెల్లపాటు చేసి పెడతా.

చలపతి పాతికేళ్లవాడిలా, ప్రేమలో తనకి పోటీదారుల్ని ఎలా అడ్డు తప్పించుకోవాలో తప్పిస్తూనే మనసిచ్చిన దానికి ఎలా సహాయపడాలో పది నిమిషాలు దీర్ఘంగా ఆలోచించాడు.

సరే. నిన్ను చూస్తుంటే జాలేస్తోంది. అంచేత అసలు సంగతి చెప్పేస్తున్న. ఆ రంగి కుటుంబం నాకు బాగా పరిచయం. ఆ రంగికి ఒక ఆవుంది. దానిపేరు మహలక్ష్మి. దాని పాలు, పేడ నిరర్ధకం అయిపోతున్నాయని ఎవరూ కొనడం లేదని దిగులుపడి చిక్కి సగం అయింది. అంచేత నువగాని నడుం బిగించి ఆ పాలు, పేడా రోజూ అమ్మి పెట్టావంటే రంగి నాల్రోజుల్లో నీ వశం అయిపోతుంది. చెయ్యగలవా? అనడిగాడు మొహంలో మొహం పెట్టి.

గణపతికి ఆవేశం వచ్చింది. ప్రేమని జయించడానికి, ప్రేమించనదాన్ని వశపరచుకోడానికి ఎంతో మంది ఎన్నో ఘనకార్యాలు చేశారు. యుద్ధాలు చేశారు. త్యాగాలు చేశారు. దీనికి మంగలి కొట్లో చదివిన పుస్తకాలే సాక్ష్యం. కాని తను కేవలం ఆవుపాలు, పేడ వీధుల వెంట తిరిగి అమ్మాలి. అంతేగదా! ఓస్. అయినా ఎలాగూ ఇంట్లోకి రోజూ పాలు కావాలి. ఇహ పేడంటారా? ఆవు పేడ పవిత్రం, పిడకలు కొడితే వంట చెరకు బదులు పిడకల వంట చేస్తుంది ముసల్ది.

అలానే – రేపే మొదలుపెడతా

శుభం. నీకంతా మేలు జరుగుగాక! వెళ్లి నేపంపించానని చెప్పు. నీ పని సుళువవుతుంది.

అప్పటికే గణపతి సగం దూరం వెళ్లిపోయాడు.

గణపతి తల్లి వెంకాయమ్మకి కొడుకు వాలకం, పుట్టినప్పటినించే అర్థం కావడం లేదు. నాల్రోజుల్నుంచి అస్సలు అర్థం కావడం లేదు. లీటర్లకొద్దీ ఆవుపాలు, తట్టలతో పేడ తెచ్చి కొంపలో పడేస్తున్నాడు. బారెడు పొద్దెక్కినా నిద్రలేవడం తెలీనివాడు తెల్లవారకట్టే ఎవరో లేపినట్లు మేలుకొని చెంబు, బుట్ట చేత్తో పుచ్చుకుపోతున్నాడు. ఇద్దరికీ ఇన్ని పాలెందుకురా నాయనా అంటే ముసలి ముండవి తాగు, కండపడతావ్ అంటున్నాడు. కొంపంతా పేడ కంపు కొడుతోందిరా అని గోలపెడితే వంటచెరకు ధరలు పెరుగుతున్నాయిట, అంచేత పిడకల వంట

చేయమంటున్నాడు. ఒకరోజు మరీ గొడవ చేస్తే పేడని ఉండలు ఉండలుగా చేసి వీధిలో పిల్లలకి తలో రెండు ముద్దలు పంచిపెట్టాడు. ఉపాదానం పంతులికి నాలుగు ముద్దలు చేతిలో పెట్టి ఆశీర్వదించమని కాళ్లపైన పడ్డారు. పేడదానాలు అలవాటులేని ఆయన కొయ్యబారిపోయేడు.

వారం రోజులుగా ఈ తతంగం జరుగుతోంది. గణపతికి తొందరగానే ఉంది. ఎప్పుడెప్పుడు రంగిని పలకరించి సరే అనిపించుకుందామా అని తహతహ లాడిపోతున్నాడు. మొదటిరోజు వెళ్లి పాలు, పేడ కావాలని అడగంగానే ఆమె మొహంలో ఆనందం కొట్టొచ్చినట్లు కనిపించింది.

కాని పోను పోను రోజు రోజుకి ఆమె యాంత్రికంగా చెంబులోపాలు పోసి, బుట్టలో పేడ పెట్టి ఇవ్వడం జరుగుతోందే గాని ప్రేమ పరిచయం వృద్ధి చెందుతుందన్న భావన గణపతికి కలగకపోవడం చేత దిగులుపడ్డాడు. సమయం చూసి తన

మనసులోని మాట చెప్పాలని అనుకుటుండగా ఒకరోజు ఆమె అనుకోకుండా పాలచెంబు చేతికిచ్చి పేడబుట్టని నెత్తి పెడుతూ రోజూ ఇన్ని పాలూ, ఇంత పేడ తీసుకెడుతున్నారే... ఏం చేస్తున్నారు? అనడిగింది.

అంతే! గణపతికి ఎదురుచూస్తున్న సమయం ఆసన్నం కావడం చేత తెగించి ఏం చెప్పమంటావ్ రంగీ ఈ పాలని, ఈ పేడని ఏం చేసుకోవాలో తెలీక అల్లాడిపోతున్నాను. ఇదంతా నీకోసమే రంగీ! నీ పాలూ, నీ పేడా ఎప్పటికీ నా సొంతం కావాలి అని ఇంకా వ్యాకం పూర్తికాకమునుపే గణపతి కుడిదవడ ఛెళ్లుమన్నది. చిత్రంగా ఎడం వైపున రెండు దంతాలు నేలకొరిగినాయి.

గణపతి నోటిద్వారా జరిగింది విని చలపతి లోపల సంతోషపడి పైకి బాధపడ్డాడు. నిజమైన ప్రేమ సాఫీగా నడవదన్న ఇంగ్లీషు ముక్కని తెలుగులో చెప్పి ధైర్యం చెప్పాడు. కష్టాలు నష్టాలకి ఓర్చుకుని పాలూ, పేడా కొంటనే ప్రేమ ఫలించదన్నాడు. కాని గణపతి ససేమీరా తనవల్ల కాదన్నాడు. తన శక్తి సామర్థ్యాలు రంగికి అర్థమయ్యేలా ఏదైనా వీరోచిత కార్యక్రమం సూచించమని వేడుకున్నాడు.

చలపతి మళ్లీ ఆలోచించేడు.

'సరే, అయితే ... మహలక్ష్మిని కిడ్నాప్ చేసి పారెయ్యి' అన్నాడు తాపీగా.

'దొంగతనమా?' అంటూ నోరు తెరిచాడు గణపతి.

నీ మొహం. జనరల్ నాలెడ్జీ నీకు అస్సలు లేదు. దొంగతనం వేరు, కిడ్నాప్ వేరు. దొంగతనం అంటే ఎదుటివారి సొమ్ముని శాశ్వతంగా సొంతం చేసుకోవడం, కిడ్నాప్ అంటే తాత్కాలికంగా ఎత్తుకెల్లి మన కోర్కెలు తీరేక తిరిగి వొదిలేయ్యడం. ప్రేమించే వెధవలకి సామాజిక స్పృహ లేకపోతే చాలా కష్టం. మనం ఆఫీసర్లని గాని, మండలాధికార్లని గాని, ఎమ్మెల్యేల్నిగాని కిడ్నాప్ చేయబోవడం లేదే? ఆఫ్టరాల్ ఒక ఆవుని– ఓల్డ్ కౌని! పవిత్రమైన ప్రేమకోసం పవిత్రమైన ఆవుని కిడ్నాప్ చెయ్యడం నేరం కాదు. పైగా సమంజసం.

'కాని ఆవుని ఎక్కడ దాచేది? మా అమ్మగాని ఆవుని చూసిందంటే ఊరందరికి చెప్పేస్తుంది.

'నీ మొహం నీకన్నీ సందేహాలే! నీలాంటి వాళ్లు ప్రేమించడానికి అనర్హులు. ప్రేమకి ధైర్యం కావాలి. వారం క్రితం అగ్రహారంలో అవధానిగారు బాల్చీతన్నేసాడు. ఆయన కొడుకులు గోదానం కోసం ఆవు కావాలని వెతుకుతున్నారు. రంగి గోవుని కిడ్నాప్ చేసి అవధాని గారి అబ్బాయిలకి అప్పగించు. ఈలోపు రంగి దగ్గరికి వెళ్లి పవిత్రమైన ప్రేమని పళ్ళు రాలకొట్టేవుగా బట్టి నీ మహాలక్ష్మి నీకు కాకుండా పోయిందని చిన్న సెంటిమెంటుకొట్టు. దాంతో అది భోరున ఏడుస్తూ నీ కాళ్లపైన పడుతుంది. అభయహస్తం చూపించి చక్కా వచ్చెయ్. అవధాని గారికి తర్పణం వొదలగానే మహలక్ష్మిని మళ్లీ రంగికి అప్పచెప్పు. అది పొంగిపోయి నీ వశం కాకపోతే నన్నడుగు' చలపతి గడగడా చెప్పాడు.

గణపతి పథకం విని పొంగిపోయాడు. అతడికంటికి మూడడుగుల చలపతి ముప్పయి అడుగుల విశ్వరూపం విష్ణుమూర్తిలా కనిపించేడు. రంగికి తనకి కలిగే ప్రథమ కుసుమానికి చలపతి అనో చలపతమ్మ అనో నామకరణ చేయాలని గట్టిగా అనుకున్నాడు.

'అవునూ– అసలు ఆవుని కిడ్నాప్ చేయడం ఎలా?' అనడిగాడు లేవబోతున్న చలపతిని ఆపి...

చలపతికి చెప్పక తప్పింది కాదు, చెప్పేడు...

రాత్రి పదకొండు గంటలయింది. బజార్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయ్. గణపతి నడుస్తున్నాడు. లుంగీని కాళ్లపైకి మడిచి కట్టేడు. మొహం కనిపించకుండా

అంగవస్త్రాన్ని తలచుట్టూ చుట్టేడు. అతడికి ఎంతో ఉద్వేగంగా ఉంది. అనుకున్న పని విజయవంతంగా పూర్తయితే కన్నతల్లిని రెండు రోజులు ఉపవాసం ఉంచుతానని దేవుడికి మొక్కుకున్నాడు. గణపతి నడుస్తూనే చలపతి చెప్పిన పథకాన్ని నెమరు వేసుకున్నాడు. రంగి ఇంటి వెనక తాటాకుల దడిని చించుకుని లోనికి వెళ్లాడు. ఆవు ఏ చెట్టుకో కట్టేసి ఉంటుంది. నిశ్శబ్దంగా దాన్ని నడిపించుకుని బయటికి తీసుకురావాలి. నల్లటి కంబళీని దానిపైన కప్పాలి– దానికి చలేస్తుందని కాదు, ఎవడూ గుర్తుపట్టకుండా. దాన్ని సరాసరి అవధాని గారి ఇంటికి తీసుకెళ్లి, వాళ్ళబ్బాయిల్ని నిద్రలేపి అవధానిగారు రాత్రి తనకి కలలో కనిపించారని, ఈ మూడ్రోజులు ఈ గోవులో తను ప్రవేశించి, నివశిస్తానని అంచేత గోమాతని అపురూపంగా, ప్రేమగా చూసుకోమన్నారని చెప్పి గోవుని వాళ్లకి అప్పజెప్పి ఇంటికెళ్లి నిద్రపోవాలి. తర్వాత జరగాల్సింది చలపతి తాను చూసుకుంటానని

అభయం ఇచ్చేడు.

ఆలోచనల్లో ఉన్న గణపతి రంగి ఇంటిని సమీపించిన విషయం గుర్తించలేదు. దాటుకుని పోతుండగా వీధి కుక్క మొరిగింది. గణపతి వులిక్కిపడి తెప్పరిల్లి రంగి ఇల్లు సమీపించిందన్న సత్యాన్ని గ్రహించి, పరధ్యానంలోంచి తనను మళ్లించిన శునకానికి థాంక్స్ చెప్పి, ఇంటివెనక భాగాన్ని చేరుకున్నాడు.

గణపతి ఒక్క క్షణం ఆగి పరిసరాలని సరీక్షగా చూసేడు. చలపతి చెప్పినట్లు తాటాకుల దడి దొడ్డి చుట్టుతా ఉంది. అతడు అటు ఇటు చూసేడు. ఎవరూ తనని గమనించడం లేదని రూఢీ చేసుకుని చటుక్కున కూర్చుని ఒక తాటాకుని బరబరా బయటకి లాగేడు. దారి ఏర్పడింది. మళ్లీ అటు ఇటు చూసేడు. మెల్లిగా తలని లోనికి నెట్టి పరిస్థితిని చూపులతోనే అంచనా వేయసాగేడు.

మసక వెన్నెల దొడ్డంతా పరచుకుంది. మామిడి చెట్టు వద్ద మహలక్ష్మి నిలబటుండటం గణపతికి ఉత్సాహం అధికం కాగా మెల్లిమెల్లిగా లోనికి పాకుతున్నాడు. గణపతి దాదాపు పూర్తిగా లోనికి వెళ్లిపోయాడు. లేచి నిల్చోబోయి ఒక్కసారిగా ఆగిపోయేడు. చెవులు రిక్కడించి విన్నాడు. గుండె జల్లుమన్నది. ఏదో శబ్దం... ఎవరో తనలాగే పాక్కుంటూ లోనికి వస్తున్నాడు.

గణపతికి పాదాలు మాత్రం బయట వున్నాయి. మిగిలిన శరీరంలోనికి వచ్చేసింది. అంచేత కదలకుండా, అలాగే ఉండిపోయేడు. లీలగా శబ్దం వినిపిస్తూనే ఉంది. కళ్లు చిట్లించి శబ్దం వస్తున్న వైపుగా చూసేడు. ఎవరో పాక్కుటూ గోమాతవైపుగా వెడుతున్నారు. గణపతికి అంతా అర్థమైపోయింది. తనలాంటి వాడే ఇంకోడు? గణపతి పూర్తిగా లోపలికి వచ్చేసేటి పరుగుపరుగున వెళ్లి పాకుతున్న పెద్దవాడి పైన పడ్డాడు. ఆ వ్యక్తి చచ్చాన్రో భగవంతుడా అంటూ అరిచేడు...

“ఎవరు నువ్వు?’ అన్నాడు గణపతి అతడిని గట్టిగా పట్టుకోని

‘నువ్వెవరు?’

నా పేరు– అవధాని

నా పేరు గణపతి అన్నాడు మొహం దాచుకున్న వ్యక్తి.

గణపతికి కోపం వచ్చింది. అబద్దం. నాపేరు గణపతి నీ పేరు చెప్పు.

‘అయితే నా పేరు అవధాని’.. అన్నాడా వ్యక్తి. తర్వాత పెద్దగా నవ్వేడు. గణపతికి భయం వేసింది. నిజంగా అవధాని గారే దయ్యమై ఆవుకోసం వచ్చేడేమోనని. అంచేత లేచినిల్చున్నాడు. పైనబడ్డ బరువు ఉపసంహరించుకోవడం చేత ఆ వ్యక్తి లేచి నిల్చున్నాడు.

గణపతి ఆ వ్యక్తిని పరీక్షగా చూసేడు– కూరలమ్మే వీరయ్య! ఆశ్చర్యపోయాడు. వీరయ్యా నువ్వా. ఈ వయసులో ... ఇలా ఇలా ఏదో అనబోతుండగా వీరయ్య గణపతి చేతులు పుచ్చుకుని క్షమించు గణపతి బాబు. రేపు నాగపంచమి. ఆవుపాలు పితుక్కుపోదామని ఇలా వచ్చా. ఎవ్వరికీ చెప్పక. నీకు పుణ్యముంటుంది. అవునూ, నువ్వు కూడా పాలకోసం వచ్చావా?

అడిగాడు.

లేదు. సాక్షాత్తూ ఆవుకోసం వచ్చాను. అదో పెద్దకథ. తర్వాత చెప్తాపదా. ఇద్దరం కలిసి మహాలక్ష్మిని బయటపడేద్దాం.పాలు నీకు, ఆవునాకు.

ఇద్దరూ చేయి చేయి పట్టుకోని పదడుగులు వేసి ఆగారు. ఇద్దరికీ ఒకపాలి– ఒకే అనుమానం వచ్చింది. ఆవులో కదలిక లేదేం? తోక విసరటమో, కాళ్లు కదపటమో చెయ్యాలిగదా. కాని అలా నిశ్చలంగా సిమెంటు విగ్రహంలా ఎలా నిల్చునండగలదు?

ఇద్దరూ మొహాలు చూసుకొని తాకిచూస్తే తెలుస్తుంది కదా అని దగ్గరికెళ్లి గణపతి భక్తిగా వెనకభాగానికెళ్లి తాకి కళ్లకద్దుకొంటుండగా ఆవులేచి నిటారుగా నిల్చున్నది. వంటిపైన తెల్లటి చర్మం దుప్పటిలాగా కిందికి జారిపడిపోయింది. చిత్రంగా ఆవుకి మీసాలు, గడ్డాలు కనిపిస్తున్నాయి. మానవ భాషలో మాట్లాడుతున్నాయి. ఎవర్రా వెధవనా కొడుకుల్లారా. దొంగతనం చేయడానికొచ్చారురా అంటోంది.

వీరయ్య, గణపతి ఇద్దరూ పరీక్షగా చూడగా అప్పుడు అర్థమైంది. అది ఆవుకాదు, అప్పలస్వామి –రంగి తండ్రీ. ఇంతసేపూ తెల్లదుప్పటి కప్పుకోని చెట్టుకింద వొంగున్నాడు.

అప్పలస్వామి ఇద్దర్నీ చెరొక చేత్తో పుచ్చుకోని ఒకరి తలకాయను ఇంకొకళదానికి కొడుతూ నానా తిట్లు తిట్టిపోస్తున్నాడు. ఇంటిలోపల దీపాలు వెలిగాయి. రంగి బైటకు వస్తుంది. గణపతి, వీరయ్య ఇద్దరూ అతని చేతిలోంచి తప్పించుకొని చీకట్లోకి పారిపోయారు. రంగి నిద్రకళ్ళతో అక్కడికి వచ్చింది. జరిగింది తెల్సుకుని కోపగించుకుంది. మహలక్ష్మిని ఆవిడగారి పిల్లలకి ఆ సాయంత్రం అరువుగా ఇవ్వడం మంచిపనైందని అనుకుంటుండగా చెట్టుపైనుంచి పెద్ద మూట కిందపడింది. తండ్రీ, కూతుర్లు పరీక్షగా చూశారు. అది మూట కాదు చలపతి! లేచి దుమ్ము దులుపుకుంటూ నేనేకానీ అవధానిగారి పిల్లల్ని మీ దగ్గరికి పంపించి మహలక్ష్మిని తోలికెల్లించకపోతే ఇలా ఈ దొంగవెధవలు కాజేసి ఉండేవారు. రంగీ ఇదంతా నీకోసం. నీ ప్రేమకోసం నన్ను ప్రేమించవా అని చేతులు చాచి అంటున్న చలపతిని అప్పలస్వామి ఎత్తి గిరాటేసే ప్రయత్నం చేయబోగా రంగి తండ్రిని వారించి అతడివంక జాలిగా చూస్తూ మొదటిసారి చూసినప్పుడు నిన్ను చిన్న కుర్రవాడివని సరిపెట్టుకున్నా. కానీ ఇప్పుడు అర్థమైంది. ముప్పయి యేళ్ల బుద్దులు పదేళ్ల శరీరం నిన్ను చూస్తుంటే జాలేస్తుంది. కానీ నీళ్లు కావాలన్నా గ్లాసు కావాలి. కూడు తినాలంటే ఆకూ కంచం కావాలి. అలాగే మన శరీరాలు కూడా. చూస్తూ చూస్తూ మూడడుడుల ఎత్తున్న నిన్ను ఎవర్తి కట్టుకుంటుంది. అంచేత జాగ్రత్తగా వెళ్లి ఎప్పుడైనా వస్తూండు. ఇంద, ఈ రూపాయి పట్టుకెళ్లి కాఫీ తాగు అంటూ రూపాయి బిళ్ల అతని చేతికిచ్చి తండ్రీ కూతుర్లు లోపలికి వెళ్లిపోయారు. చలపతి ఐదు నిమిషాలు అలాగే నిల్చున్నాడు. రంగి ఇచ్చిన రూపాయి నాణాన్ని ఆ...గా తన రెండు చెంపల పైనా రుద్దుకున్నాడు. కంటినీళ్లతో తడిసిన బుగ్గకి రూపాయి బిళ్ల అతక్కుపోయింది. చెట్టంత మనిషికి మనసు లేకపోతే కసాయివాడు అంటారు. కొండంత మనసున్న తనకి శరీరం లేకపోవడం చేత మరుగుజ్జువాడు అంటారు. శరీరానికి శరీరం కావాలి. మనస్సుకు మనసు కావాలి. తనకు మనసుంది. అంచేత రంగి మనసు తనదే. రంగి తనదే అనుకుంటూ చీకట్లో కలిసిపోయాడు మూడడుగుల చలపతి.

(చనిపోయినా జ్ఞాపకాల్లో బ్రతికున్న అన్నదానం వెంకటేశ్వర్లు శృతికి చిహ్నంగా)